క్లుప్తంగా

వామనావతారంలో జగన్నాథుడు



వామనావతారంలో జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురం శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం జగన్నాథ స్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో పాత్రను ధరించి ఉన్న ఈ అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. ఈనెల 6 వరకు స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు.

సుబ్రహ్మణ్యుడికి పూజలు



జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఉపాలయమైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

6న తొలి ఏకాదశి వేడుకలు



విధమ్మవారికి పూజ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: తొలి ఏకాదశి వేడుకలు ఈనెల 6న శ్రీవిధమ్మవారి ఆలయం వద్ద నిర్వహిస్తున్నట్లు రజక సంఘం పేర్కొంది. తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న ఆలయ వద్ద మంగళవారం రజక సంఘ పెద్దలు సమావేశం నిర్వహించారు మూడు రోజులపాటు ఉత్సవాలు ఏర్పాటు చేశామన్నారు. 40 ఏళ్లుగా ఆలయం వద్ద నిర్వహిస్తున్న తొలి ఏకాదశి వేడుకల్లో అమ్మవార్లకు పొంగళ్లు, బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దిప్ప కాయలపాడు, పొంగుటూరు, బోడిగూడెం గ్రామాల్లోని విధమ్మ అమ్మవారికి తొలి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చింతలపూడి విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు



ధాత్రి నాగలక్ష్మి

చింతలపూడి: 2025 – 26 విద్య సంవత్సరానికి సంబంధించి పీజీ సెట్ పరీక్షల్లో కంప్యూటర్ సైన్స్, లైఫ్ సైన్స్, కెమికల్ సైన్స్ విభాగాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. తమ విద్యార్థిని బావి ధాత్రి నాగలక్ష్మి కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులో రాష్ట్రస్థాయిలో 143వ ర్యాంకును సాధించారని పేర్కొన్నారు. నాగలక్ష్మికి, వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిపారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఆసుపత్రి వైద్యులు

జంగారెడ్డిగూడెం: స్థానిక సాయిస్ఫూర్తి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా అందించే ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసకోవాలని వైద్య బృందం కోరింది. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం ఆసుపత్రి ఆవరణలో వారు మాట్లాడుతూ తమ ఆసుపత్రి ద్వారా ప్రతి మంగళ, శుక్రవారాల్లో గర్భిణులకు ఉచిత స్కానింగ్, వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ఎముకల విభాగంలో ప్రత్యేక ఎమర్జెన్సీ టీమ్‌తో ప్రమాదంలో గాయపడిన వారికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. జ్వర నిర్ధారణ పరీక్షల్లో 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. ఆసుపత్రిలో 24/7 వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, జంగారెడ్డిగూడెంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు వినీల, కోమల (గైనిక్), దిలీప్ (జనరల్), రత్న (చిన్నపిల్లల వ్యాధులు), మురళీకృష్ణ (లాప్రోస్కోపీ, జనరల్), లక్ష్మీకాంత, భరత్ (ఆర్థో), రామకృష్ణ, ప్రశాంత్, సౌజన్య, వాసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల (ఇంటర్ క్యాంపస్) లో గత సోమవారం నిర్వహించిన 73వ విద్యార్థి సంఘ ఎన్నికల ఫలితాలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్ మంగళవారం ప్రకటించారు. ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించి, వారిని అభినందించారు.

ప్రధాన రహదారులు అధ్వానం

- జంగారెడ్డిగూడెంలో రాకపోకలకు పాట్లు
- వాహనచోదకుల ఆవేదన



జంగారెడ్డిగూడెం పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు



జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట రోడ్డుపై గోతిలో నిలిచిన నీరు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రధాన రహదారులు గోతులతో అధ్వానంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్లపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక బుట్టాయగూడెం రోడ్డు, శ్రీనివాసపురం రోడ్డు, అశ్వారావుపేట రోడ్డు, ఏలూరు రోడ్డు ఇలా.. ప్రతి రోడ్డూ గోతులతో దర్శనమిస్తున్నాయి. సాధారణ రోజుల్లో వాహనచోదకులు గోతులను తప్పించుకుంటూ రాకపోకలు సాగించే వారు. ప్రస్తుత వర్షాలకు గోతుల్లో నీరు చేరి, ఏ గొయ్యి మేరకు ఉందో తెలియక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల రోడ్లు ఛిద్రంగా మారుతున్నాయి. జంగారెడ్డిగూడెం పట్టణంలో వ్యాపార కేంద్రం కావడంతో నిత్యం వాహన రాకపోకలు జరుగుతునే ఉంటాయి. పాఠశాలలు, కళాశాలలు ఎక్కువగా ఉండటంతో నిత్యం పదుల సంఖ్యలో బస్సులు ప్రయాణిస్తుంటాయి.

కానరాని శాశ్వత చర్యలు

మరమ్మతులు చేస్తున్నప్పటికీ శాశ్వత ప్రాతిపదికన చర్యలు లేకపోవడంతో కొద్ది రోజులకే రోడ్లు యథాస్థితికి చేరుతున్నాయి. దీంతో ప్రజా ధనం నీటిపాలవుతుందని పలువురు విమర్శిస్తున్నారు. స్థానిక బుట్టాయగూడెం రోడ్డు పొట్టి శ్రీరాముల విగ్రహం నాలుగు రోడ్ల కూడలి వద్ద భారీ గోతులు ఏర్పడటంతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. వాహనాలు సైతం అదుపు తప్పుతున్నాయి. అశ్వారావుపేట రోడ్డులోని టౌన్‌హాల్ సమీపంలో రోడ్డు ఉందా అనేంతగా ఛిద్రమైంది. ఏలూరు రోడ్డు పొడవునా గోతులతో నిండి ఉంది. ఇక శ్రీనివాసపురం వెళ్లే రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గోతులతో ఇబ్బందులు

పట్టణంలోని రావాలంటే ఇబ్బందులు పడుతున్నాయి. ప్రధాన రహదారులన్నీ గోతులతో ఉన్నాయి. వాహనాలు గోతుల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయి. అశ్వారావుపేట రోడ్డు, ఏలూరు రోడ్డు, బుట్టాయగూడెం రోడ్డు ఇలా ప్రతి రోడ్డుపైనా గోతులు దర్శనమిస్తున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి

– కె.సద్గురు, జంగారెడ్డిగూడెం

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

జంగారెడ్డిగూడెం పట్టణం వ్యాపార, విద్యా కేంద్రంగా బాసిల్లుతోంది. ఈ పట్టణంతో పాటు చుట్టుపక్కల ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఇక్కడకు వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు. పలు విద్యా సంస్థలు, అలాగే ప్రముఖ వ్యాపార సముదాయాలు ఉన్నాయి. నిత్యం ప్రజలు ఏదో పని కోసం వాహనాలపై వస్తుంటారు. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయించాలి.

– డి.సాకేత్, జంగారెడ్డిగూడెం

పచ్చిరొట్ట సాగుతో అదనపు ఆదాయం



పచ్చిరొట్ట పంటకోత ప్రయోగం చేస్తున్న దృశ్యం

చింతలపూడి : పచ్చిరొట్ట సాగుతో పచ్చదనంతో పాటు రైతులకు అదనపు ఆదాయం, భూమికి జీవం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ మండల డిజిటల్ ఫెసిలిటేటర్ మరికంటి గోపాలకృష్ణ తెలిపారు. చింతలపూడి మండలంల ఎండపల్లి గ్రామంలో రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నవధాన్యాల పచ్చిరొట్ట సాగుపై రైతులకు అవగాహన కలిగించారు. మండలంలో పచ్చిరొట్ట, నవధాన్యాల సాగు విజయవంతంగా జరుగుతున్నట్టు గోపాలకృష్ణ చెప్పారు. 45 రోజుల నవధాన్యాల పంట కోత ప్రయోగాన్ని మంగళవారం నిర్వహించారు. ఎకరాకు 18 కిలోల విత్తనాలు చల్లితే దాదాపు 22 టన్నుల పచ్చిరొట్ట పశుగ్రాసం దిగుబడి వస్తుందన్నారు. ఈ పచ్చిరొట్ట పశువులకు పోషకమైన మేతగానే కాకుండా, భూమికి నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ముఖ్యమైన మూలకాలను అందిస్తుందని వివరించారు. ఎకరా సాగు ద్వారా మొత్తం 60 కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్ భూమిలోకి చేరుతుందని చెప్పారు. రసాయన ఎరువులతో సమానమైన శక్తి భూమికి అందిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయని తెలిపారు. రైతులు ఈ విధానం ద్వారా భూములను సారవంతం చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి నరసింహ, ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసనకు మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

జంగారెడ్డిగూడెం: ఈనెల 9న కార్మికులు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు, వ్యవసాయ కార్మికులు, రైతుల నిరసనలకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తెలిపింది. పార్టీ స్థానిక కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం నాగమణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరాం మాట్లాడారు. 9న జరిగే సమ్మెకు సీపీఎం సంపూర్ణమద్దతుని ప్రకటిస్తుందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు పని గంటల పెంపు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమేనన్నారు. కార్మిక హక్కుల్ని కాలరాస్తూ, ధరలు, నిరుద్యోగం పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రజలను పక్కదోవ పట్టించేందుకు మతాన్ని రాజకీయాల్లోకి లాగుతున్నారని వివరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని కోరారు. గిరిజనులు, పేదల పక్షాన నిలబడి భూ సమస్యను చట్ట ప్రకారం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్వీడీ ప్రసాద్, ఆర్ లింగరాజు, తెల్లం, రామకృష్ణ, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్ జిల్లానాయకులు ఎం.జీవరత్నం, ధర్మాల రమేష్, వై.నాగేంద్రరావు, ఎ.ఫ్రాన్సిస్, జి.నరసింహారావు, ఎస్.మహంకాళి, కె.భాస్కర్, తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, మడకం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌పై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మధుబాబు

చింతలపూడి : పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 5న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులను పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. లోక్ అదాలత్ విశిష్టత గురించి విస్తృత ప్రచారం చేయాలని న్యాయవాదులను, అధికారులను కోరారు. ప్రతి రోజు కోర్టులో ప్రీ సిట్టింగ్స్ ద్వారా కేసులను రాజీ చేస్తున్నట్టు చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండో రోజుకు కార్మికుల సమ్మె

జంగారెడ్డిగూడెం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె మంగళవారం రెండో రోజూ కొనసాగింది. యూనియన్ ప్రెసిడెంట్ కంతేటి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు, విద్యుత్, కంప్యూటర్ ఆపరేటర్లు సుమారు 45 మంది దశల వారీగా ఆందోళన చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని నాయకులు కోరారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సూపర్ 50 తరగతులు ప్రారంభం



కామయ్యకుంట పాఠశాలలో తరగతులను పరిశీలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: మండలంలోని కామయ్యకుంట, నూతిరామన్నపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం నుంచి సూపర్ 50 పదో తరగతి ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను డీవైఈఓ ప్రసన్నకుమార్, ఏఎంఓ కె.శిరమయ్యలు పరిశీలించారు. ఆ ప్రత్యేక తరగతుల నిర్వహణ వల్ల 10వ తరగతిలో అధిక మార్కులు సాధించవచ్చన్నారు. గత ఏడాది పాడేరు, సీతం పేటలో ప్రత్యేక తరగతుల వల్ల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో కామయ్యకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్ఆర్‌పాలెం బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక తరగతులు ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో సీఎంఓ ఎస్ శ్రీనివాసరావు, జీసీడీఓ డి.రాజేశ్వరి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



జంగారెడ్డిగూడెం : వైద్యులను సన్మానించిన దృశ్యం



చింతలపూడి : వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన 50 మంది వైద్యులను సన్మానించారు. ఎంతటి ప్రమాకరమైన పరిస్థితులు ఉన్నా, వైద్యులు వైద్య సేవలు అందిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారని లయన్స్‌క్లబ్ నూతన ప్రెసిడెంట్ శేషుకుమార్ తెలిపారు. రీజనల్ చైర్‌పర్సన్ కన్నం హనుమంతరావు, వైస్ ప్రెసిడెంట్ లయన్ కొండపల్లి పండు, జోన్ మాజీ చైర్‌పర్సన్ మద్దిపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇన్నరవీల్ క్లబ్ ఆఫ్ జంగారెడ్డిగూడెం గోల్డ్ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో చార్టర్ అకౌంటెంట్లు బండారు సత్యనారాయణ, దాకావరపు కృష్ణ, సాయి దుర్గా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు భోగేశ్వరరావు, దొండమూడీ పిల్లల ఆస్పటల్ వైద్యులు రాంప్రసాద్, డెంటల్ క్లినిక్ వైద్యులు చామర్తి శివరాం, జెమిని ఆస్పటల్ వైద్యులు స్వాతిలను సత్కరించారు. గోకుల పారిజాత గిరి ఆలయం గిరి ప్రదక్షిణ రహదారికి ఇరువైపులా మామిడి మొక్కలు నాటారు. ఇన్నరవీల్ క్లబ్ ఆఫ్ జంగారెడ్డిగూడెం గోల్డ్ అధ్యక్షురాలు నాగసూరి మాధురి తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో..

చింతలపూడి : వైద్య వృత్తిని దైవంగా భావించి పేదలకు సేవ చేసినప్పుడే డాక్టర్‌గా విజయం సాధించినట్లని లయన్స్‌క్లబ్ అధ్యక్షులు అడపా శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్లు నారాయణరావు, రసూల్, బండి లక్ష్మీ ప్రసాద్, జబీవుల్లా, తౌసీఫ్, లక్ష్మణ కుమార్, రాంబాబు, దుర్గప్రసాద్, నవీన్, లక్షణ రావు, చైతన్య, హరీశ్, సూర్య, విజయ లక్ష్మి, జ్యోత్స్న, దివ్య, శ్రావణి, భావన, అచ్యుత, కాశీ విశ్వేశ్వరరావు, మహర్షిలను ఘనంగా సన్మానించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సన్మానించారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం

కొయ్యలగూడెం: కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు ఆనందం సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు సతీష్ నరహరిశెట్టి, చక్రపాణి, యశ్వంత్ రెడ్డి, ఎం భాగ్యలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులు టి.రాజశేఖర్, తోట సుబ్బారావులను ఘనంగా సత్కరించారు.

ఏరులై పారుతున్న మద్యం

టి.నరసాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బెల్టు షాపులు విచ్చలవిడిగా పెరిగాయని సీపీఎం టి.నరసాపురం మండల కమిటీ నాయకులు గుడెల్లి వెంకట్రావు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోందని పేర్కొన్నారు. టి.నసాపురం పంచాయతీ ప్రకాష్ నగర్‌లో నాలుగు బెల్టు షాపులు ఉన్నాయని, ఈ షాపుల వద్ద మహిళలు సైతం ఆందోళన చేశారని తెలిపారు. తక్షణమే గ్రామంలో బెల్ట్ షాపుల్ని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏలూరు సమావేశానికి తరలిరండి

బుట్టాయగూడెం: ఏలూరులో ఈ నెల 4న నిర్వహించే వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి పోలవరం నియోజకవర్గం నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటుచేశారని, ముఖ్య నాయకులు హాజరవుతున్నారని చెప్పారు.

కోడె నాగు పట్టివేత



కోడె నాగును పట్టుకున్న క్రాంతి

జంగారెడ్డిగూడెం: స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలోకి మంగళవారం కోడినాగు ప్రవేశించింది. పామును గమనించిన కానిస్టేబుల్ సంతోష్ నుంచి స్నేక్ సేవియర్స్ సొసైటీ సంస్థకు సమాచారం అందించారు. దీంతో ఆ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి వచ్చి పామును పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

బెల్లపు ఊట ధ్వంసం



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కుక్కునూరు: మండలంలోని శ్రీధరవేలేరు పంచాయతీ పరిధిలోని కిన్నెరసాని వాగు ఒడ్డున సారా తయారీ శిబిరాలపై మంగళవారం దాడులు నిర్వహించామని సీఐ ఎం రమేష్ బాబు తెలిపారు. 1500 లీటర్ల బెల్లం ఊటను, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని బెల్లం ఊట ధ్వంసం చేశామని పేర్కొన్నారు. సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నిర్మాణాత్మక దృక్పథాన్ని అలవర్చుకోవాలి



యువత - సృజనాత్మక ఆలోచనలు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: విద్యార్థులు కొత్తగా ఆలోచన చేయటం ద్వారా నిర్మాణాత్మక దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్ బాబు సూచించారు. ఆయన అధ్యక్షతన యువత – సృజనాత్మక ఆలోచనలు అనే కార్యక్రమంలో భాగంగా సామాజిక ప్రభావం కోసం యువత అనే అంశంపై మంగళవారం స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సీనియర్ అధ్యాపకులు యు.వెంకటాచార్యులు, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ మట్టా మధు, వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, ఆంగ్ల అధ్యాపకులు యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కోఆర్డినేటర్ పి.సన్యాసిరావు మాట్లాడారు. యువత కొత్త ఆలోచనలు చేయడం ద్వారా ఆర్థిక ప్రగతికి కొత్త ఆర్థిక వనరులు సృష్టించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఊరేగింపు



క్షేత్ర వీధుల్లో ఊరేగుతున్న ఆంజనేయస్వామి రథం



రథంలో కొలువైన ఆంజనేయ స్వామి

ద్వారకాతిరుమల: హనుమద్ జయంతి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక తూర్పు వీధిలో కొలువైన ఆంజనేయ స్వామివార్ని మంగళవారం సాయంత్రం క్షేత్ర వీధుల్లో ఊరేగించారు. ఏటా వలె నాయీ బ్రాహ్మణులు ఈ వేడుకను కనుల పండువగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తిని అశ్వరథ వాహనంలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అట్టహాసంగా ఊరేగించారు. భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ప్రసాదాలను స్వీకరించారు. తిరిగి స్వామివారు రాత్రికి ఆలయానికి చేరుకున్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో మేలు

పోలవరం రూరల్: సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు అన్నారు. పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నారు నర్సరీ బ్రెడ్ తయారీకి ఒక ఎకరాకు 20 నుంచి 25 కేజీలు విత్తనం, వెదజల్లే పద్ధతికి 24 కేజీలు, బెంగాల్ ట్రాన్స్ ప్లాంటేషన్‌కు 12 నుంచి 15 కేజీలు విత్తన మోతాదు అవసరం అవుతుందన్నారు. ఖరీఫ్ సాగుకు ఎంటీయూ-1061, ఎంటీయూ-1064, ఎంటీయూ-1318, పీఎల్ఏ-1100, బీపీటీ-5204, సంపద స్వర్ణ తదితర రకాలు అనుకూలమన్నారు. ఎకరాకు ఐదు సెంట్లు నారుమడి సరిపోతుందని తెలిపారు. నారుమడి తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది కె.రమ్య, రైతులు వేగివాడ పుష్పరరావు, చోడపిండి వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులు తీసుకోవాలి

చింతలపూడి : కౌలు చేసే రైతులందరూ కౌలు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోటగిరి మురళీ కృష్ణ సూచించారు. చింతలపూడి మండలం యర్రంపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం గురించి, నారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యావన అధికారి ఎండీ షాఫియా పర్వీన్, గ్రామ ఏఈఓలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లింగపాలెం మండలంలో..

లింగపాలెం: మండలంలోని కలరాయనగూడెం, మఠంగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, పచ్చిరొట్ట పైర్ల వల్ల ఉపయోగాలు, కౌలు కార్డుల ఉపయోగాలను వివరించారు. ఆయా గ్రామాల రైతులు, నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసపురం రైతు సేవా కేంద్రంలో..

జంగారెడ్డిగూడెం: మండలంలోని శ్రీనివాసపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రైతు సేవాకేంద్రంలో వ్యవసాయాధికారి సీహెచ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతులకు పాడిపంటల నిర్వహణ పుస్తకాలను పంపిణీ చేశారు. సర్పంచ్ వై.రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎలికే వరప్రసాద్, పోల్నాటి నాని, తన్నీరు రామకృష్ణ, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జి ఎం షాలిని, సీఆర్పీ జె.రమ్య, రైతులు పాల్గొన్నారు.